2. హరితయాత్రికుడు – దరిపల్లి

పాఠంలోకి ప్రవేశించేముందు:

మంచి పనులను చేస్తూ పోవాలేగాని ప్రతిఫలాన్ని ఆశిస్తూ చేయరాదు. ప్రతిఫలం దానంతట అదే వస్తుందనేది ఆర్యోక్తి.

మామిడి టెంక నాటిన ముదుసలి కథ మీరు వినియే ఉంటారు. ఒక వయోవృద్ధుడు మామిడి టెంకలు నాటుతుంటాడు. అటుగా వాహ్యాళికి వెళుతున్న రాజుగారు ఆ వింత చూసి నవ్వుతూ నీవు నాటిన విత్తు చెట్టై ఫలములిచ్చుదాక బ్రతికి ఉందువా? అని ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా వృద్ధుడు ముందు ఎవరో నాటిన చెట్ల ఫలాలను నేను అనుభవించాను. నేడు నేను నాటుతున్నవి భావితరాల కొరకు అంటాడు. అందుకు సంతసించిన రాజు అతనికి కొన్ని బంగారు నాణెములు బహుకరిస్తాడు. వెంటనే ముదుసలి ''చూచితిరా! నాటిన విత్తు నాటీ నాటకముందే ఫలము నిచ్చినద' ని చమత్కరిస్తాడు.

ఇటువంటి వ్యక్తులు నాడే కాదు. నేడూ ఉన్నారని నిరూపించిన మహనీయుని గురించి తెలుసుకుందామా!



దరిపల్లి రామయ్యగారు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామవాస్తవ్యులు. దరిపల్లి రామయ్య గారు అట్టతో చేసిన ఒక చక్రాన్ని కిరీటంలాగా ధరిస్తారు. అది అలంకారం కాదు. అదొక సందేశం లాంటి ఆదేశం. ఎందుకంటే దాని మీద 'వృక్షో రక్షతి రక్షితః' అని వ్రాసి వుంటుంది. ఆయన చెట్లు నాటుతూ, నాటమని ప్రజల మనస్సుల్లో నాటుకొనేలా చెబుతుంటారు, మొక్కలను ఉచితం గా పంచుతూ దాదాపు 75 యేళ్ళ వయస్సులో కూడా ఎనలేని కృషి చేస్తున్నారు. అందుకే ప్రజలు ఆయనను 'వన జీవి, చెట్ల రామయ్య' అని పిలుస్తున్నారు. రామయ్యగారు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణల కొరకు చెట్లు నాటడమే కాదు వాటిని బాధ్యతగా పెంచుతున్నారు. సంరక్షిస్తున్నారు.

చెట్లు నాటడం వెనుక ఆయనకు స్ఫూర్తి నిచ్చిన సంఘటనల గురించి అడిగినపుడు – అలాంటివి చాలా వున్నాయంటారు రామయ్యగారు. బాల్యంలో ఓసారి తల్లి నల్లని బీరగింజలను నాటగా పచ్చని మొక్కలు మొలవడం– పెరిగి అల్లుకొని తీగలకు పసుపు పూలు పూయడం– కాయలు కాసి వ్రేలాడటం ఎంతో ఆశ్చర్యంగా గమనించారట. తోటి పిల్లలు పోటీలుపడి అగ్గిపెట్టెలతో పొడుగు పొడుగు రైళ్ళు చేస్తుంటే రామయ్య పుల్లలనే నిశితంగా గమనించారట. వాటి కొనలు నల్లని గింజల్లా ఉండటం వలన వాటిని తీసుకువెళ్ళి మట్టిలో నాటారంట. తల్లి అగ్గిపెట్టెకై వెతికి రామయ్యా! అణా పెట్టికొన్న అగ్గిపెట్టెలోని పుల్లలు పారేసి పెట్టెతో ఆడావా? అని గద్దించిందట. రామయ్య తను చేసిన పనిని చెబితే నవ్వుకొని ఏవి నాటితే చెట్లు మొలుస్తాయో వివరించిందట.

ముత్తగూడెం బడిలో ఉపాధ్యాయుడు బోధించిన 'మొక్కలు – వాటి ఉపయోగాలు' పాఠం, బడిలోని తోటపని పీరియడ్, హెడ్ మాస్టర్ బి. మల్లేశం, ''ఇతరుల చెట్ల కాయలు కోయడం చీవాట్లు తినడం కన్నా, మీరే చెట్లు నాటి వాటి పండ్లు తినండి'' అని చెప్పిన మాటలు ఎంతో స్ఫూర్తి నిచ్చాయని తెలిపారు. అలాగే అశోకుడు, ప్రతాపరుద్రుడు బాటలకిరువైపులా చెట్లు నాటారని పాఠాల్లో చదువుకోవడం కూడా ఒక కారణమేనంట. అంతేగాక గురజాడ అప్పారావుగారు.

''స్వంత లాభం కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్''
''దేశాభిమానం నాకుకద్దని
వట్టి గొప్పలు చెప్పకోకోయ్,
పూని యేదైనాను నొకమేల్
కూర్చి జనులకు చూపవోయ్'' – అని అంటే

'మొక్క నాటి చూపా! నాకు తెలిసినది అదే!' అంటూ సంతోషంగా నవ్వుతూ చెప్పారు. గ్రామంలో రకరకాల వ్యాధులకు మొక్కలు అనేక రకాలుగా ఉపయోగపడటం దాని ద్వారా చెట్ల ప్రాముఖ్యతను గుర్తించడం మరొక కారణం అంటారు. ఈ విధంగా జీవితంలో వివిధ దశల్లో స్ఫూర్తిని పొంది ఇనుమడించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. ఏ మొక్కను చూపినా ఆ మొక్క ఉపయోగాన్ని అలవోకగా చెప్పుతారు. వనరక్షణ మీద వెయ్యికిపైగా సూక్తులు కూర్చారంట. కుమారుల పెండ్లి కార్డులపై కూడా **'ప్రకృతి మాతా వనలక్ష్మి ఆశీస్సులతో'** అని ముద్రించారు.

మనమరాళ్ళకు 'హరిత, చందన, పుష్ప' అనే పేర్లు పెట్టుకున్నారు. ఎండిన మొక్క ఎక్కడ కనపడినా నీళ్ళు పోయకుండా వెనుతిరగరు. రామకోటి రాయడం కన్నా కోటి చెట్లను పెంచడం మిన్నగా భావిస్తారు.

అనేక దుష్టరాక్షసుల సంహారానికి ప్రతీకగా పండుగలు జరుపుకుంటారు. ప్రస్తుతం వికటాట్టహాసం చేస్తున్న కాలుష్య రాక్షసుణ్ణి సంహరించడానికి కత్తులు, ఆయుధాలు అవసరం లేదు. ప్రతి ఒక్కరు ఒక్క మొక్కను నాటి ప్రేమగా పెంచితే చాలు. కాలుష్యభూతాలను తరిమికొట్టవచ్చు అంటూ పచ్చని పుడమి కోసం నిత్యం ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భార్య జానమ్మ చేదోడువాదోడుగా నిలుస్తున్నది.

అడవినుంచి సేకరించిన గింజలను బస్తాలలో నిలువ చేసి తొలకరి వానలు కురియగానే వాటిని నాటి, పెంచి ఆ మొక్కలని అందరికి మొక్కాతిథ్యం పేరుతో శుభ కార్యాలకు బహుమతిగా ఇస్తుంటారు. పాఠశాలలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కటేమిటి కనిపించిన చోటల్లా సైకిలుపై తిరుగుతూ మొక్కలు నాటి భూమాత ఋణం తీర్చుకుంటున్నారు.

దీనిని గుర్తించిన

- జిల్లా అటవీశాఖ 'పర్యావరణ అవార్డును'
- అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్-గౌరవ డాక్టరేట్‌ను'
- భారత ప్రభుత్వం 2017లో పద్మశ్రీ పురస్కారాన్ని అందించారు.

ఈ సందర్భంగా అనేక పత్రికలు, ప్రసార మాధ్యమాలు ఇతనిని 'హరిత యాత్రికుడు', 'వనమాలి', 'గ్రీన్ వారియర్', గ్రీన్ క్రూసేడర్' అని అనేక విధాల కొనియాడాయి.

దీనికి ప్రతిస్పందన దరిపల్లి మాటలలో:

- ఈ అవార్డుతో బాధ్యత మరింత పెరిగింది. అనేక మంది ప్రేరితులవుతారని నమ్ముతున్నాను.
- ఉద్యానవనంలో విహరించినంత ఆనందంగా ఉంది.
- ప్రభుత్వం నన్ను కాదు పర్యావరణ పరిరక్షణను గుర్తించారు.
- అందరూ నాలాగా మొక్కలు నాటుతారని, వనజీవులవుతారని నా ఆశ.
- చేసింది తక్కువ, చేయాల్సింది ఎక్కువని నేను భావిస్తున్నా.
- నేను నాటిన కోటిచెట్ల నీడలో రేపటి తరం సుఖంగా ఉండాలనేదే నా తపన.
- మొక్కలు నరికేవారేగాని నాటేవారు కనబడటం లేదు.

''చెట్లను పెంచుటే ధ్యేయమురా ఇది
మానవ జాతికి రక్షణరా ఇది
నే చదివిన జీవిత పాఠమురా ఇది'' అంటారు
దరిపల్లి రామయ్య

రామయ్య గారి మొక్కవోని స్ఫూర్తితో-

మొక్కల్ని నాటుదాం!
మొక్కల్ని సాకుదాం!!
ముందుకు సాగుదాం!!!

రోడ్ల వెంట ఆయన నాటిన నిద్ర గన్నేరు విత్తనాలు మహావృక్షాలుగా పెరిగాయి. ఇద్దరు మనుషులు చెట్టు కాండాన్ని బాహువులు చాచి పట్టుకున్నా చేతులు కలువవు.

చెట్టు లేని చోట విత్తనాలు చల్లి అవి మొలకెత్తితే ఆ విత్తనానికి పునర్జన్మ నిచ్చినట్లు నేను భావిస్తా!
– దరిపల్లి రామయ్య

రెండు కేజీల రామ తులసి విత్తనాలు భద్రాచలం దగ్గర పర్ణశాలలో సేకరించి తిరుమలకు పంపారు రామయ్యగారు.

I. వినండి–సంభాషించండి.

1. మీకు తెలిసిన కొన్ని చెట్ల పేర్లను చెప్పండి.
2. 'వృక్షోరక్షతి రక్షితః' – సంభాషించండి.
3. చెట్లు పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు ఎట్లు ఉపయోగపడుతున్నాయో సంభాషించండి.
4. రకరకాల వ్యాధులకు మొక్కలు పెంచడం ఉపయోగకరం – సంభాషించండి.

II. చదవండి–ఆలోచించండి–రాయండి.

అ. పదజాలం పెంపొందించుకుందాం.

వాహ్యాళి = విహారం; స్ఫూర్తి = ఉత్సాహం; చీవాట్లు = తిట్లు, నిందా వాక్యాలు; ఇనుమడించుట = రెండింతలవుట; అలవోకగా = తేలికగా; సూక్తులు = మంచి మాటలు; ప్రతీక = గుర్తు; పుడమి = భూమి; నిత్యం = ఎప్పుడూ; చేదోడువాదోడుగా = సహాయంగా; స్పందన = కదలిక; తపన = అధికమైన ఆసక్తి; ధ్యేయము = లక్ష్యం.

ఆ. చర్చించండి–రాయండి.

1. దరిపల్లి రామయ్యగారు జన్మించినది.
2. రామయ్యగారిని ప్రజలు పిలుస్తున్న పేర్లు.
3. రామయ్యగారు తన మనుమరాళ్ళకు పెట్టిన పేర్లు.
4. దరిపల్లి రామయ్యగారు భూమాత ఋణం తీర్చుకుంటున్న విధం.
5. రామయ్యగారి సేవలను గుర్తించి వివిధ సంస్థలు బహుకరించిన అవార్డులు/పురస్కారాలు.
6. రామయ్యగారిని వివిధ పత్రికలు, ప్రసారమాధ్యమాలు కొనియాడిన విధం.
7. పురస్కారాలు/అవార్డులు పొందిన తరువాత దరిపల్లి రామయ్యగారి ప్రతిస్పందన.

III. కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ. చెట్లు నాటడం వెనుక దరిపల్లి రామయ్యగారికి స్ఫూర్తి నిచ్చిన ఏవైనా నాలుగు సంఘటనలు:

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________

చెట్లు నాటడం వెనుక ఆయనకు .... సంతోషంగా నవ్వుతూ చెప్పారు.



ఆ. కింది పదాల వచనం మార్చి రాయండి.

1) తీగ = [ ]   2) ఉపాధ్యాయులు = [ ]

ఇ. స్వీయస్పందన:

చెట్లు నాటడం వలన కలుగు ప్రయోజనాలను గూర్చి మీ సొంత మాటల్లో రాయండి.

IV. భాషావగాహన:

అ. కింద గీతగీసిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.

ఏ మొక్కను చూపినా దాని ఉపయోగాన్ని అలవోకగా చెప్పుతారు.

మొక్క = ____________ దాని = ____________ అలవోక = ____________ చెప్పుతారు = ____________

ఆ. కింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.

1) బాల్యము X ☐ 2) ఉపయోగం X ☐ 3) మేలు X ☐

4) సంతోషము X ☐ 5) ఉత్సాహం X ☐ 6) తక్కువ X ☐

1) ఉట్టి అంటే తెలుసా? పూర్వకాలం పాలు, పెరుగు, వెన్న, నెయ్యిలను కుండలలో పెట్టుకొనేవారు. వాటిని కుక్కలు, పిల్లలకు అందకుండా భద్రపరచుకోవలసి వచ్చేది. అందుకొరకు తాళ్ళతో అల్లిన ఉట్టిలో పెట్టేవారు.

- వెన్నదొంగ అని ఎవరిని అంటారు?
- **మీనా – రాజు,** నీరు దొరకక ఎండలకు విలవిలలాడుతున్న పక్షుల కొరకు చిన్న చిన్న ఉట్లు అల్లి అందులో మట్టి పాత్రలు పెట్టి నీరుపోశారు. ఇంటి బయట చెట్లకు వేలాడదీసారు.

జట్టుపని : చర్చించండి – చేయండి.

మీరు వేసవిలో ఇంకా ఏమేమి చేయాలనుకున్నారో? చర్చించండి, రాయండి.

2) నీకు నచ్చిన చెట్టును గూర్చి కింది అంశాల ఆధారంగా వర్ణించి రాయండి.

- వివిధ రకాల చెట్లు
- అందులో నీకు నచ్చిన చెట్టు
- నచ్చుటకు కారణములు
- లాభములు
- ముగింపు

సృజనాత్మకత:

"అదునులో నాటితే
పదునుగా పెరుగుతా
కంపలో విసిరినా
సొంపుగా మొలుస్తా



సొంపుగా సాకితే
ఇంపుగా పెరుగుతా
ఎదిగి ఎల్లప్పుడు
మీక్షేమమే కోరుతా...... అని విత్తనం

అంటుందంటారు మీ దరిపల్లి రామయ్యతాత మరి మొక్క/వృక్షం ఏమంటుందో ఊహించి మీరొక కవిత రాయండి.



- వివిధ రకాల ఔషధమొక్కలను గురించిన సమాచారాన్ని అంతర్జాలంలో సేకరించి, వాటి ప్రయోజనాలను గూర్చి నేస్తంతో చర్చిద్దాం.
- దరిపల్లి రామయ్య గురించిన దృశ్య చిత్రాలను (వీడియో) చూద్దాం. స్ఫూర్తిని పొందుదాం.

కాలములు

ఉపా : కింది వాక్యాలు గమనించండి.

1. పిల్లలు పాఠాలు విన్నారు.
2. పిల్లలు పాఠాలు వింటున్నారు
3. పిల్లలు పాఠాలు వినబోవుచున్నారు.

శ్యామ్ నువ్వు చెప్పు ఈ మూడు వాక్యాల్లో క్రియ ఒకేలా ఉందా?

శ్యామ్ : లేదు సార్. మొదటి వాక్యంలో పని జరిగిపోయినట్లుగా ఉంది.

ఉపా : ఇలా జరిగిపోయిన పనిని తెలియచేయు కాలం 'భూతకాలం'.
రెజీనా! రెండవ వాక్యం గురించి నువ్వు చెప్పు

రెజీనా : పని జరుగుచున్నట్లుగా ఉంది సార్.

ఉపా : అంటే జరుగుచున్న పనిని తెలియచేయుకాలం 'వర్తమాన కాలం'.
సయ్యద్! మూడవ వాక్యం గురించి నువ్వు చెప్పు.

సయ్యద్: జరగబోవుచున్న పనిని తెలియచేయు కాలం.

ఉపా : అంటే జరుగుబోవుచున్న పనిని తెలియచేయు కాలమును 'భవిష్యత్కాలం' అంటారు.

లేఖననైపుణ్యాలు – లేఖారచన

మన మనోభావాలను వ్యక్తం చేయడానికి లేఖలు మంచి సాధనాలు. లేఖలు రెండు రకాలు. అవి (అ) అధికార లేఖలు (నియత లేఖలు) (ఆ) అనధికార లేఖలు (అనియత లేఖలు) ఐతే ఏరకమైన లేఖ రాయడానికైనా కొన్ని సూచనలు పాటించాలి.

ఇప్పుడు అనధికార (అనియత) లేఖలు రాయడానికి పాటించాల్సిన సూచనలు చూద్దామా!

సూచనలు : (1) కుడివైపు పైభాగంలో మీ చిరునామా 4, 5 వరుసల్లో రాయాలి. (2) ఉత్తరం ఎవరికి రాస్తున్నామో వారిని సంభోదించాలి. ఉదా: పూజ్యులైన నాన్నగారికి, ప్రియమైన స్నేహితునికి.. (3) మొదటి పరిచ్ఛేదంలో (పేరాలో) వారి క్షేమ సమాచారాలు అడిగి, మన క్షేమ సమాచారాలు తెలియజేయాలి. (4) రెండవ పరిచ్ఛేదంలో రాయదలచిన విషయ వివరణ రాయాలి. (5) చివరి పరిచ్ఛేదంలో ముగింపు రాయాలి. (6) ఆ తర్వాత కుడి చేతి వైపు కింద ముగింపు, సంబోధన, లేఖ రాసిన వారిపేరు (7) పిదప ఎడమ చేతి వైపు లేఖ ఎవరికి రాస్తున్నామో వారిపేరు, చిరునామా రాయాలి.

ఇప్పుడు కింది అంశాల ఆధారంగా హరిణి, చంద్రికకు రాసిన లేఖను పక్కపుటలో చదివి నేర్చుకుందాము.

అంశాలు

- నీ (హరిణి) చిరునామా
- సంబోధన
- మొదటి పేరా : క్షేమ సమాచారాలు
- రెండవ పేరా : లేఖలో అడిగిన విషయం

* క్యాంపుకు ఎప్పుడు వెళ్ళారు?
* క్యాంపుకు ఎక్కడికి వెళ్ళారు?
* అక్కడి విశేషాలు
* నీవేవిధంగా గడిపావు
* ఆఖరి పేరా, ముగింపు

ఇట్లు, మీ స్నేహితురాలు, హరిణి.

చంద్రిక చిరునామా

చంద్రిక,
ఇంటి నంబరు : -301,
నలంద బిల్డింగ్,
అణుశక్తి నగర్,
ముంబయి.